సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 15 । జూలై । 2024



అయ్యో.. అన్నమయ్య!
పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి, అన్నమయ్య ఉద్యానవనంలో ఉన్న 108 అడుగుల విగ్రహం పట్ల టీటీడీ నిర్లక్ష్య ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. -8లో



మద్యం మత్తులో డ్రైవింగ్
మద్యం మత్తులో నిర్లక్ష్యంగా లారీని నడిపి ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో బస్సు కండక్టర్ దుర్మరణం చెందాడు. ఆల్విన్ కర్మాగారం సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.600	రూ.720
రెండోరకం	రూ.420	రూ.580

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 648 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వైఎస్సార్ జిల్లాలో వర్షం కురిసింది. కాశినాయనలో 23.2 మిల్లీమీటర్లు, పోరుమామిళ్లలో 22.2, దువ్వూరులో 7.6, బి కోడూరు 6.4 , వీఎస్‌పల్లిలో 5.6 , పెద్ద ముడియం 5.4, జమ్మలమడుగు, బిమఠంలో 4.2, కలసపాడు 3.4, రాజుపాలెం, గోపవరం , సీకేదిన్నెలో 3.2, బద్వేల్‌లో 2.4, ప్రొద్దుటూరు 2.2, కమలాపురం 1.6, వేముల, కడపలో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'వెలిగల్లు'లో పెరిగిన నీటి మట్టం

గాలివీడు: ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని వెలిగల్లు వైఎస్సార్ రిజర్వాయర్‌లోకి నీరు చేరింది. దీంతో నీటి మట్టం పెరిగింది. 4.64 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.77 టీఎంలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపిక

రాయచోటి జగదాంబసెంటర్: కేరళ రాష్ట్రంలోని కొల్లంలో ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీల వరకు జరిగే సబ్ జూనియర్ హాకీ పోటీలకు అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన బాలాజీ, జయక్రిష్ణనాయుడు, మదనపల్లెకు చెందిన అఖిల్, వెంకటేష్ ఎంపికయ్యారని అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు. వీరు వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరుగుతున్న సౌత్‌జోన్ జూనియర్ హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరిలో అఖిల్, వెంకటేష్ ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా, జయకృష్ణనాయుడు గోల్‌కీపర్‌గా ఎంపికయ్యారని శివప్రసాద్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో తాళ్లపాక కల్యాణోత్సవ టికెట్లు

రాజంపేట: తాళ్లపాకలో ఈనెల 22న జరిగే శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి కల్యాణోత్సవ టికెట్లను ఆన్‌లైన్‌లో పొందొచ్చని టీటీడీ అధికారులు తెలిపారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చెప్పారు. టీటీడీ ఈవీఏఎస్‌టీ హెచ్‌ఏఎన్‌ఏఎంఎస్. ఏపీ.జీవోవీ.ఇన్‌లో టికెట్లు పొందొచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆర్జిత కల్యాణోత్సవ టికెట్ పొందలేని వారికి ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 21న తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కల్యాణ ఆర్జితసేవా టికెట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. శివ, కేశవ కల్యాణోత్సవం సాయంత్రం 6గంటలకు జరుగుతుందన్నారు.

నేడు జంప్ రోప్ జిల్లా స్థాయి ఎంపికలు

మైదుకూరు: ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో జంప్‌రోప్ పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా జంప్ రోప్ స్పోర్ట్స్ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ ఎంపికల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు. జిల్లా నుంచి విభాగాల వారీగా ఎంపికైన విద్యార్థులు ఈనెల 27, 28 శని, ఆదివారాల్లో నంద్యాల జిల్లాలోని 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్ రోప్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫారం, ఈవెంట్ ఫారం అనే రెండు ఫారాలు ఇస్తామని, పోటీలకు ఎంపికైన క్రీడాకారులు రెండు రిజిస్ట్రేషన్ ఫారాలతోపాటు, ఆధార్ , స్కూల్ స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి అందజేయాలని వివరించారు.

సౌత్ఇండియా హాకీ పోటీల్లో ఆంధ్రా హవా



హాకీ ఆడుతున్న ఆంధ్రప్రదేశ్- కర్ణాటక జట్లు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరిగే సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలలో ఆంధ్రా జట్టు తన హవా కొనసాగిస్తోంది. జూనియర్స్ మహిళా విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు, కర్ణాటక జట్టుపై మూడు గోల్స్ వేసి విజయం సాధించింది. ఆంధ్రలో శ్రీవిద్య 2గోల్స్, అంకిత 1గోల్ చేశారు. అలాగే తమిళనాడు జట్టు పాండిచ్చేరి జట్టుపై 15గోల్స్ చేసి విజయం సాధించగా..తెలంగాణ జట్టుపై కేరళ విజయం సాధించింది. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ జట్టుపై గెలుపొందింది. తమిళనాడుపై కర్ణాటక, పాండిచ్చేరిపై కేరళ జట్లు విజయం సాధించాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చాణిక్య రాజ్ తెలిపారు.

వెట్టి చాకిరీ.. ఉత్తి నౌకరీ

కాంట్రాక్టు లెక్చరర్లపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఒక వైపు కాంట్రాక్టు రెన్యువల్ కాకపోవడం మరో వైపు జీతాలు మంజూరు చేయకపోవడంతో అధ్యాపకుల్లో ఆందోళన నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూన్ నెలలోనే రెన్యువల్ చేయడంతోపాటు ఏడాదిలో 12 నెలల కాలపరిమితికి సర్వీస్‌లో కొనసాగేలా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఏడాదంతా జీతాలు వచ్చాయి. కానీ ఈ ఏడాది అలా కాకపోవడంతో అధ్యాపకులంతా ఆందోళన చెందుతున్నారు.

- ఉద్యోగ సర్వీసు రెన్యూవల్‌ను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కాంట్రాక్ట్ అధ్యాపకుల్లో ఆందోళన.. కుటుంబాల్లో ఆవేదన
- మే, జూన్ నెల జీతాల మంజూరు కాక అవస్థ



పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 190 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారు. ఏటా ప్రభుత్వం వీరిని రెన్యూవల్ చేస్తుంటుంది. తాజాగా వీరి కాల పరిమితి ఏప్రిల్ నాటికే పూర్తయింది. ఇక 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యువల్ చేయాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన చంద్రబాబు ప్రభు త్వం అస్సలు పట్టించుకోలేదు. కళాశాలల ప్రారంభమై నెలన్నర కావస్తున్నా వీరికి జీతాలు రాలేదు. ఇక వీరి రెన్యువల్ ఉత్తర్వుల జాడే లేదు. దీంతో అధ్యాపకుల కుటుంబాల్లో ఆవేదన నెలకొంది. వీరికి రెన్యువల్ ఉత్తర్వులు వస్తేనే జీతాల బిల్లుల పెట్టేందుకు అవకాశం ఉంటుంది. కళాశాలలు పునః ప్రారంభం నుంచి వీరంతా యథావిధిగా వారి వారి కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. జీతాలు అందక కుటుంబాల నిర్వహణ భారంగా మారిందని కాంట్రాక్ట్ అధ్యాపకులు వాపోతున్నారు.

వైఎస్ జగన్ హయాంలోనే మేలు జరిగింది

గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తూనే కాంట్రాక్ట్ అధ్యాపకుల జీతాల పెంపు జీఓను అమలు చేశారు. మూడేళ్ల క్రితం పీఆర్‌సీ ఇచ్చిన సమయంలో ఏకంగా రూ. 57,100కు పెరిగింది. గత ప్రభుత్వంలో తమకు మేలు జరగడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలకు కాంట్రాక్టు లెక్చరర్లు పాలాభిషేకాలు చేసి సంబరాలను నిర్వహించారు. కాంట్రాక్టు లెక్చరర్లందరూ జగన్‌కు మద్దతుగా ఉన్నారనే కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆలస్యం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ ఏడాది మే నెల నుంచి...

కాంట్రాక్టు అధ్యాపకులు ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, అనంతరం ఆన్‌లైన్ మూల్యాంకనం విధులు నిర్వహించారు. అలాగే 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు సంబంధించిన డ్రైవ్‌ను కూడా నిర్వహించారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాలల్లో విద్యార్థులకు బోధనలను అందిస్తున్నారు. మే, జూన్ రెండు నెలలు పూర్తిగా పని చేశారు. కానీ ఇప్పటిదాకా వారికి జీతాలు రాలేదు.

ఉమ్మడిజిల్లాలో కళాశాలలు: 24

అధ్యాపకులు: 190 మంది

రెన్యూవల్ ఉత్తర్వులు ఇవ్వాలి...



గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేసేలా గెజిట్, జీవోను కూడా ఇచ్చింది. అయితే ఎన్నికలు రావడం వల్ల అది తాత్కాలికంగా నిలిచిపోయింది. కానీ కాంట్రాక్టు విధానాన్ని మొదట ప్రవేశ పెట్టింది అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే. కాబట్టి ప్రస్తుతం చర్యలు తీసుకుని రెగ్యులర్ చేయాల్సిన అవసరం ఉంది.
– హనీఫ్, ఉమ్మడి కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఇబ్బందిగా ఉంది...



రెండు నెలలుగా జీతాలు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. మే, జూన్ నెలంతా పనిచేశాం. రెన్యూవల్ కాకపోవడంతో జీతాలు బిల్లు చేయడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమవుతోంది. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా బోధన సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రెన్యూవల్ చేసి జీతాలను మంజూరు చేయాలి.
–వి. జానీబాబు, కాంట్రాక్టు లెక్చరర్స్ జనరల్ సెక్రటరీ, ఉమ్మడి కడపజిల్లా

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు..



ఉమ్మడిజిల్లాలో కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించిన విద్యా సంవత్సర కాల పరిమితి ఉత్తర్వులు ఇంకా రాలేదు. దీంతో వారి జీతాలు పెట్టడం కష్టం. ప్రభుత్వం నుంచి రెన్యూవల్ ఉత్తర్వులు రాగానే జీతాలు మంజూరు చేయిస్తాం. – బండి వెంకటసుబ్బయ్య, డీవీఈఓ, ఇంటర్ విద్య

కువైట్‌లో చింతపర్తి వాసి ఆర్తనాదాలు

- సొంతూరికి రప్పించాలని వేడుకోలు
- స్పందించిన ఎంబసీ



కుటుంబ సభ్యులతో శివ

వాల్మీకిపురం: ఎన్నో ఆశలతో కువైట్‌కు వెళ్లిన ఓ తెలుగు వ్యక్తి ఏజెంట్ చేతిలో మోసపోయాడు. ఎడారిలో తాను కష్టాలు పడుతున్నానని, కాపాడాలంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. 'ఎడారిలో మేకలు, గొర్రెలు, కుక్కలకు నేనొక్కడినే మేత వేస్తున్నా..నీళ్ల కోసం 2 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఈ ఎండలకు నా వల్ల కావడంలేదు. ఎవరైనా సాయం చేయండి.. లేదంటే చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు.. చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన రామచంద్ర రావ్ కుమారుడు శివ (40) అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం బోయపల్లికి చెందిన శంకరమ్మను 18ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి వెన్నెల, వనిత అనే కుమార్తెలు ఉన్నారు. శివ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బిడ్డలను చదివించలేని పరిస్థితి ఉండడంతో పెద్ద కుమార్తెతో పాటు భార్యను సైతం కూలీకి తీసుకెళ్లి వచ్చిన డబ్బుతో చిన్న కుమార్తె వనితను చదివిస్తున్నాడు. ఈ క్రమంలో కువైట్ వెళ్లి డబ్బు సంపాదించి పెద్ద కుమార్తెకు వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పులు చేసి డబ్బులు పోగేసుకొని రాయచోటికి చెందిన ఏజెంట్ హైదర్‌ను సంప్రదించాడు. అతని ద్వారా శివ నెలక్రితమే కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ఎడారిలో గొర్రెలు, పావురాలు, బాతులు మేపడానికి బాధితుడిని పెట్టారు. అయితే అక్కడ సంబంధిత యజమానులు నాలుగు రోజులైనా గొర్రెల దగ్గరికి రాకపోగా సరిపడా ఆహారం, నీటిని అందించకపోవడంతో బాధితుడు భయపడిపోయాడు. ఈ తరుణంలో తన భార్యకు, ఏజెంట్‌కు సమాచారం అందించాడు. తిరిగి రావడానికి డబ్బులు ఎవ్వరు ఇస్తారని, నువ్వు అక్కడే పని చేయాల్సిందేనని ఏజెంటు చెప్పడంతో తన దగ్గర డబ్బులు లేవని, భార్య నిస్సహాయత చూపడంతో బాధితుడు చేసేది ఏమీలేక తనకు చావే శరణ్యమని, తనను ఎవరైనా దయగలవారు ఇండియాకు తీసుకెళ్లాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. ఈ పోస్టును చూసిన ఎంబసీ వారు స్పందించారు. బాధితుడు శివను భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి.

మా నాన్నను భారత్‌కు రప్పించండి



మా నాన్న శివ కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ఎడారిలో ఉన్నాడు. దయచేసి ఎవరైనా సహాయం చేసి మా నాన్నను భారత్‌కు రప్పించండి.
– వనిత, బాధితుడి కుమార్తె

వైభవం.. ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

యాలి వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సునీల్ కుమార్ బృందం ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై గరుడ పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. మహావిష్ణువుకు గరుత్మంతుడు ప్రియ వాహనం. కావున గరుడ నిలువెత్తు రూపం 20 మీటర్ల నూతన వస్త్రంపై పసుపు, కుంకుమ, తైలంతో చిత్రీకరించారు. దీనినే ధ్వజపటం అంటారు. ఈ నూతన వస్త్రం ధ్వజస్తంభంపై ఎగురవేస్తే సకల దేవతలు బ్రహ్మోత్సవాలను తిలకిస్తారని ప్రతీతి. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడు శ్రీ సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి పుర వీధుల్లో ఊరేగుతూ భక్తజన కోటికి దర్శనమిచ్చారు.



యాలి వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హంస వాహన సేవ ఉంటుందని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, ఉమ్మడి కడప జిల్లా ఆలయ సూపరింటెండెంట్ హనుమంతు తెలిపారు.

ప్రతిభ చూపితే.. భవిత మీదే

- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 11 తరగతి విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్,ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- సెప్టెంబర్ 15 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తుది గడువు
- అక్టోబర్ 23 నుంచి 27 తేదీల మధ్యలో పరీక్ష



వీవీఎం బ్రోచర్

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా వీవీఎం పేరిట ఏటా ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు స్టేట్ బోర్డు, సీబీఎస్‌ఈ, ఎన్‌సీఈఆర్టీ వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబరిచినవారు భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

జూనియర్, సీనియర్ విభాగాల్లో....

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్ 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషల్లో పరీక్ష రాయవచ్చు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక ఇలా...

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3,10,17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, 2 వేలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా....

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదట ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు మెమెంటో,ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023–224 జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో సీఎస్ఐఆర్, బీఏఆర్‌సి వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

100 మార్కులకు పరీక్ష



ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 23 నుంచి 27 తేదీల్లో (ఏదో ఒక రోజు మాత్రమే) ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు (గంటన్నర) పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో 100 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం,ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 10 ప్రశ్నలుంటాయి.

దరఖాస్తు విధానం ఇలా..

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది.ఇందుకు సంబంధించిన అక్టోబర్ 23 లేదా 27వ తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 90 నిమిషాలు మాత్రమే పరీక్ష ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌టాప్, డెస్కటాప్,డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. పాఠశాల, జిల్లా, రాష్ట్ర ,జాతీయ స్థాయిల్లో పరీక్షలు ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌ఎఫ్ఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు.
–శివప్రకాష్‌రెడ్డి, డిఈఓ

క్లుప్తంగా

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 30 ఏళ్ల వయసు కలిగిన అతను ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు పాత బస్టాండులో మద్యం మత్తులో పడి ఉండగా పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతను తన పేరు చెప్పలేదని, ఊరు మాత్రం నంద్యాల అని చెప్పినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతను రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు, బంధువులు ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ వెంకటరమణ తెలిపారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

లక్కిరెడ్డిపల్లి : ఒంటిమిట్ట మండలం, పెన్నపేరూరు గ్రామంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడిపై వేడి నూనె పోసి దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఎం.అంకన్న ఒక ప్రకటనలో కోరారు. చిన్నప్పగారి గజ్జల వెంకటసుబ్బారెడ్డి ఇంటి అరుగుపై పడుకున్నాడనే కారణంతో అతనిపై క్రూరతో దాడి చేయడమే గాక అతని ఒంటిపై సలసల కాగుతున్న నూనె పోయడం దారుణమన్నారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అయ్యో.. అన్నమయ్య!

- రాజంపేటలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహానికి పొంచి ఉన్న ప్రమాదం
- విగ్రహ బేస్‌కు నెర్రెలు
- మరమ్మతులను మరిచిన టీటీడీ
- విగ్రహ పర్యవేక్షణపై నిర్లక్ష్యపు నీడలు


అన్నమయ్య విగ్రహం బేస్ రాళ్ల మధ్యలో ఏర్పడిన నెర్రెలు


108 అడుగుల అన్నమయ్య విగ్రహం

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి, అన్నమయ్య ఉద్యానవనంలో ఉన్న 108 అడుగుల విగ్రహం పట్ల టీటీడీ నిర్లక్ష్య ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అన్నమాచార్యుల 600 జయంత్యుత్సవాలను అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి హయాంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈ విగ్రహాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. రాజంపేట ప్రాంతానికే ఇది తలమానికంగా నిలిచింది.


బేస్‌లోని రాళ్ల మధ్య పాచిపట్టి, తెల్లటి ద్రావణం ఉబికి వచ్చిన దృశ్యం

పదేళ్ల క్రితం..

గతంలో ఓమారు విగ్రహం పైభాగంలో తేడా కనిపిస్తే అప్పట్లో సాక్షి ప్రచురించిన కథనంతో టీటీడీ అధికారులు పరిశీలించారు. అవి గాలినెర్రెలు అని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత విగ్రహానికి రంగులు వేసి చేతులు దులుపుకున్నారు. విగ్రహం వెనుక భాగంలో తేనెతొట్టిలు ఏర్పాటు చేసుకోవడం, పిట్టలు, పక్షులు విగ్రహంపై వేసిన రెట్టలతో అపరిశుభ్రంగా విగ్రహం కనిపించడంపై విమర్శలు రావడంతో టీటీడీ స్పందించి ప్రత్యేక ఫైరింజన్లతో విగ్రహాన్ని శుద్ధి చేసిన విషయం విదితమే.

ఇప్పుడు విగ్రహం బేస్‌కు నెర్రెలు..

వర్షాల సీజన్‌లో బాగా తడిసిపోవడం, ఫలితంగా విగ్రహం దిగువ భాగంలో ఉన్న బేస్‌లోకి నీరు ప్రవేశించడం కొనసాగుతూ వస్తోంది. దీంతో బేస్‌లో ఉన్న రాతిరాళ్ల మధ్య నెర్రెలు ఏర్పడ్డాయి. వర్షపు నీటి నిల్వలు బేస్‌లోకి చేరుతున్న క్రమంలో రాళ్ల మధ్య తెల్లటి ద్రావణం అంతా బయటికి వస్తోందని స్థానికులు, పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. బేస్‌లోని రాళ్లలో కదలిక వస్తే భారీ విగ్రహానికి ఏ విధమైన ప్రమాదం పొంచి ఉంటుందో చెప్పలేమంటున్నారు. కనీసం అన్నమాచార్యుల జయంతి, వర్ధంతి సందర్భంగా కూడా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు విగ్రహాన్ని శుభ్రపరచడం కానీ, చిన్నచిన్న లోపాలను గుర్తించి మరమ్మతులు చేయడం కానీ చేసిన దాఖలాలు లేవని భక్తులు వాపోతున్నారు. విగ్రహ నిర్వహణ విషయాన్ని టీటీడీ గాలికి వదిలేసిందనే అపవాదును మూటగట్టుకుంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు 108 అడుగుల అన్నమయ్య విగ్రహం నిర్వహణపై దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

పర్యవేక్షణ బాధ్యత టీటీడీదే



పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల ఖ్యాతిని నలుదిశలా చాటేందుకు అన్నమయ్య 600 జయంత్యుత్సవాల సందర్భంగా 108 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో అన్నమయ్య జన్మస్థలికి ప్రత్యేక గుర్తింపునకు టీటీడీ కృషి చేసింది. అన్నమయ్య జన్మస్థలిలో ఈ విగ్రహం ఏర్పాటుతో జిల్లాకే తలమానికంగా నిలిచింది. అలాంటి విగ్రహంపై పర్యవేక్షణ ఉంచాల్సిన బాధ్యత టీటీడీపై ఉంది.

– భూమన శంకర్‌రెడ్డి, సంఘసేవకుడు

అన్నమయ్య విగ్రహంపై నిర్లక్ష్యం వీడాలి



అన్నమయ్య 108 అడుగుల విగ్రహంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. అన్నమయ్య జయంతులు, వర్ధంతుల ఉత్సవాల్లో కూడా విగ్రహాన్ని శుభ్రపరచడం లాంటివి టీటీడీ చేయడం లేదు. రాజంపేట ప్రాంతానికి అన్నమయ్య 108 అడుగుల విగ్రహం తలమానికం. విగ్రహ నిర్వహణ విషయంలో బాధ్యత కొరవడినట్లుగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు విగ్రహ నిర్వహణ విషయంపై దృష్టి సారించాలి.

– మదనపల్లె పెంచలయ్య, ఎంఎస్‌పీ రాష్ట్ర నేత, రాజంపేట

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీ బురుజుపల్లికి చెందిన పులగూర రాజమ్మ (60) అనే మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందింది.

ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి భర్త గంగులప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి మ్యాజిక్‌షోలో బహుమతులు


బహుమతులు పొందిన విద్యార్థులు

రాజంపేట రూరల్ : రాష్ట్రస్థాయి మ్యాజిక్ షోలో ఫ్యూచర్‌మైండ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జూనియర్స్ విభాగంలో 2, 3 బహుమతులు సాధించారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాజిక్ షోలో పట్టణానికి చెందిన 11 మంది ఫ్యూచర్‌మైండ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అందులో జూనియర్స్ విభాగంలో ఎస్.అబ్దుల్లా ద్వితీయ బహుమతి, సి.యశ్వంత్ తృతీయ బహుమతి పొందారు. 9 మంది విద్యార్థులు ప్రోత్సాహక సర్టిఫికెట్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్‌మైండ్స్ స్కూల్ కరస్పాండెంట్ వై.నందకిషోర్‌గౌడ్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జాదూరత్న అవార్డు గ్రహీత యూపీ రాయుడును అభినందించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ
- కండక్టర్ దుర్మరణం
- 20 మంది ప్రయాణికులకు గాయాలు


లారీ, బస్సు ఢీ కొన్న సంఘటన


సంఘటనా స్థలంలో గుమికూడిన ప్రజలు




మృతి చెందిన బస్సు కండక్టర్ తారకరాముడు, డ్రైవర్ రాజు, లారీ, డ్రైవర్ మల్లెల ధనుంజయ

నందలూరు : మద్యం మత్తులో నిర్లక్ష్యంగా లారీని నడిపి ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో బస్సు కండక్టర్ దుర్మరణం చెందాడు. కడప–చెన్నై జాతీయ రహదారిలోని ఆల్విన్ కర్మాగారం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. వివరాలిలా.. ఏపీ39 యూడబ్ల్యు 3222 నంబరు గల ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి జమ్మలమడుగుకు వెళ్తోంది. ఇదే సమయంలో కడప నుంచి చెన్నైకు వెళ్తున్న ఏపీ39యూవీ 0342 నంబరుగల లారీ ఈ బస్సును ఢీకొంది. దీంతో బస్సు కండక్టర్ తారకరాముడు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ మల్లెల ధనుంజయ లారీలో, బస్సు డ్రైవర్ రాజు బస్సులో ఇరుక్కుపోయారు. బస్సులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా, మరో 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని కడప, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఇరుక్కుపోయిన వారిని కాపాడేందుకు పోలీసులు, స్థానికులు జేసీబీల సహాయంతో విశ్వ ప్రయత్నం చేసి ఎట్టకేలకు ఇద్దరినీ కాపాడి కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. కడప–చెన్నై రహదారిలో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లారీ డ్రైవర్ ధనుంజయ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు, స్థానికులు, ఫైర్ ఇంజిన్ సిబ్బంది ఎంతో కష్టపడి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుపై నిలబడి ఉండగా..

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలో రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు మండలంలో చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన నాగభాస్కర్(45) రోడ్డుపై నిలబడి ఉండగా కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న బైకు ఢీ కొని రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న సుమో వాహనం అతనిపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కడప వేదికగా అండర్-19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానాలు వేదికగా ఏసీఏ–అండర్–19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఈ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతిరోజూ మూడు మైదానాల్లో మూడు మ్యాచ్‌లు చొప్పున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు.

తేదీ	తలపడే జట్లు	వేదిక
16-07-24	కడప-రెస్టాఫ్ సౌత్	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానం
	కృష్ణా- రెస్టాఫ్ సెంట్రల్	కేఎస్ఆర్ఎం మైదానం
	విశాఖపట్నం- రెస్టాఫ్ నార్త్	కేఓఆర్ఎం మైదానం
17-07-24	కడప -కృష్ణా	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానం
	రెస్టాఫ్ సెంట్రల్-రెస్ట్ ఆఫ్ నార్త్	కేఎస్ఆర్ఎం మైదానం
	విశాఖపట్నం - రెస్టాఫ్ సౌత్	కేఓఆర్ఎం మైదానం
18-07-24	కడప - విశాఖపట్నం	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానం
	రెస్టాఫ్ సెంట్రల్-రెస్టాఫ్ సౌత్	కేఎస్ఆర్ఎం మైదానం
	కృష్ణా- రెస్టాఫ్ నార్త్	కేఓఆర్ఎం మైదానం
20-07-24	విశాఖపట్నం- రెస్టాఫ్ సెంట్రల్	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానం
	కడప -రెస్టాఫ్ నార్త్	కేఎస్ఆర్ఎం మైదానం
	కృష్ణా- రెస్టాఫ్ సౌత్	కేఓఆర్ఎం మైదానం
21-07-24	రెస్టాఫ్ నార్త్ -రెస్టాఫ్ సౌత్	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానం
	కృష్ణా -విశాఖపట్నం	కేఎస్ఆర్ఎం మైదానం
	కడప-రెస్టాఫ్ సెంట్రల్	కేఓఆర్ఎం మైదానం

బియ్యం రవాణాకు తక్షణమే టెండర్లు పిలవాలి

కడప సెవెన్‌రోడ్స్ : పౌరసరఫరాల శాఖలో ఎన్నికల ముందు లారీల ద్వారా బియ్యం రవాణా చేసే టెండర్లను రద్దు చేశారని, ఆయా టెండర్లను తక్షణమే పునరుద్ధరించి అవినీతిని ఎండగట్టాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో పౌర సరఫరాల విభాగంలో బియ్యం రవాణా లారీల బాడుగల చెల్లింపులో డిపార్టుమెంటు పేరు చెప్పి ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

రాజకీయ కక్షతోనే వైఎస్ జగన్‌పై కేసు నమోదు

- తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తి లేదు
- కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ప్రజల పక్షాన పోరాటానికి వైఎస్సార్‌సీపీ సిద్ధం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : రాజకీయ కక్ష, దురుద్దేశం, పక్కా కుట్రతోనే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తప్పు పట్టినా, అప్పటి ఎంపీ రఘురామరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని చెప్పి, కేసు కొట్టేసినా....కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా మూడేళ్ల తర్వాత వైఎస్ జగన్, పలువురు అధికారులపై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం మారినంత మాత్రాన రాజ్యాంగం మారుతుందా అన్ని ప్రశ్నించారు. పోలీసులు అత్యుత్సాహంతో కొత్త సంప్రదాయానికి తెరతీశారని, భవిష్యత్తులో ఇలాంటివి వారికే ఇబ్బందికరంగా మారుతాయని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నమ్మి ప్రజలు అధికారమిచ్చిన విషయాన్ని మరచిపోయి కక్ష సాధింపులకు దిగడం మంచిది కాదన్నారు. అధికారం శాశ్వతం కాదని, కక్షసాధింపులు మానుకోకపోతే భవిష్యత్తులో ఇవే పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు తెరచి నెలరోజులు గడుస్తున్నా తల్లికి వందనం సాయం చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ.29లో మార్గదర్శకాలు స్పష్టంగా లేవన్నారు. ఆధార్ లింక్, ఇతర నిబంధనల పేరిట తల్లికి వందనం పథకానికి ఎగనామం పెట్టకుండా ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నందున రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా రెడ్‌బుక్ పాలన పేరుతో వైఎస్సార్‌సీపీని అస్థిరపరిచేందుకు కాకుండా, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల పక్షాన పోరాటానికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు డిష్ రామకృష్ణారెడ్డి, ఎస్వీ రమణ, రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, మస్తాన్‌రెడ్డి, కోటూరి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మా నాన్నది ఆత్మహత్య కాదు

పులివెందుల : ఈనెల 12న అర్ధరాత్రి బొగ్గుడుపల్లె గ్రామంలో తన తండ్రి ప్రభాకర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు వాస్తవం కాదని ఆయన కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తమ ఇంటిలోని 20 ఏళ్ల నాటి పాత ఆల్టో కారును తమ తండ్రి వాడేవారన్నారు. కారును స్టార్ట్ చేసే క్రమంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు ఇంజిన్ పేలి డ్రైవింగ్ సీట్‌లోనే ఆయన మృతి చెందారన్నారు. ఇది ప్రమాద వశాత్తు జరిగిన సంఘటన తప్ప ఆత్మహత్య కాదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించుకోవచ్చన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి


నూతనంగా ఎన్నికైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలలకు గొడ్డలి పెట్టుగా ఉన్న జీఓ నంబర్ 117ను నూతన ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని సీఎస్ఐ స్కూలులో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు జీఓ నంబర్ 117 అడ్డంకిగా మారిందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలన్నారు. అలాగే గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెడుతూ జీఓ నంబర్ 54ను తీసుకు వచ్చిందన్నారు. దానిని ఉద్యోగ సంఘాలు అప్పట్లో వ్యతిరేకించాయన్నారు. కానీ ప్రస్తుతం ఆ జీఓను గెజిట్‌లో ప్రచురించడం శోచనీయమన్నారు. వెంటనే ఆ జీఓను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బన్న, అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ బోధనేతర పనులకు ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయవద్దని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామసుబ్బన్న, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్‌గఫార్, ఆర్థిక కార్యదర్శిగా రామకృష్ణమూర్తి, జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా విజయలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి


మృతి చెందిన కొండా పాలకొండయ్య

సిద్ధవటం : మండలంలోని నేకనాపురం గ్రామానికి చెందిన కొండా పాలకొండయ్య(71) అనే దళిత కౌలు రైతు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నేకనాపురం గ్రామానికి చెందిన పిడుగు సుబ్బారెడ్డి పొలాన్ని కొండా పాలకొండయ్య కౌలుకు తీసుకొని పసుపు పంటను సాగు చేశాడు. పాలకొండయ్య, అతని భార్య నీలమ్మ ఆదివారం ఉదయం పసుపు పంటకు నీళ్లు కట్టేందుకు పొలం వద్దకు వెళ్లారు. నీలమ్మ పసుపు పంటలో కలుపు తీస్తుండగా పాల కొండయ్య మోటారు వద్దకు వెళ్లాడు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ అక్కడే ఉన్న విద్యుత్ తీగలు తగిలి కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. నీలమ్మ కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల్లోని రైతులు అక్కడికి చేరుకున్నారు. కిందపడిన పాలకొండయ్యను పరిశీలించి అతను విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

ప్రజల మనిషి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు) : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజలతో మమేకమై ఉంటారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహిస్తారంటూ ఈనాడులో ఒక కథనం రాశారని ఆక్షేపించారు. వాస్తవానికి జగన్ ఏనాడూ జనానికి దూరంగా లేరని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు ఇప్పటి వరకు ఆయన జీవితంలో ఎంత మందిని కలిశారో అంతకంటే పది రెట్లు ఎక్కువ మందిని జగన్‌మోహన్‌రెడ్డి కలిశారన్నారు. జగన్‌ను కలుసుకునేందుకు తాము జనాలను తీసుకురావాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని, ప్రజలే జగన్‌ను కలిసేందుకు తండోపతండాలుగా వస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజల మధ్య ఉంటున్న వైఎస్ జగన్‌పై పిచ్చిరాతలు రాసి ఏదో ఒక విధంగా ఆయనను అభాసుపాలు చేసే యత్నం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

దళితుడిపై వేడి నూనె పోసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు సంపత్ కుమార్ తదితరులు

కడప కార్పొరేషన్ : ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడిపై వేడి నూనె పోసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జై భీమ్ మాలమహాసేన జిల్లా అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మాసాపేటలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన కదిరి ప్రభాకర్ తమ అరుగుపై కూర్చొన్నాడనే కుల దురహంకారంతో వేడి నూనె పోయడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వాలు దళితుల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా ఇంకా వారిపై అత్యాచారాలు, దాడులు, దమనకాండలు జరుగుతూనే ఉన్నాయన్నారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం కింద కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు శేఖర్, జై భీమ్ మాల మహాసేన ప్రధాన కార్యదర్శి చైతన్య పాల్గొన్నారు.